క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



నూతనంగా నిర్మించిన రేణుక మాతా ఆలయం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భోరజ్ మండలంలోని సిర్సన్న గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక మాతా ఆలయంలో భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా.. ఆదివారం యాగశాలలో యజ్ఞంతో పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య రేణుక మాతా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై దివ్యభారతి



ఎస్సై దివ్యభారతి

తాంసి: తాంసి మండల ఎస్సైగా దివ్యభారతి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సైల బదిలీల్లో భాగంగా ఎస్సై ఇదివరకు పనిచేసిన డి.రాధికను తలమడుగు బదిలీ చేయగా, బేల ఎస్సైగా పనిచేస్తున్న దివ్యభారతిని తాంసి ఎస్సైగా బదిలీ చేశారు. బదిలీల్లో భాగంగా తాంసి స్టేషన్‌కు బదిలీపై వచ్చిన దివ్యభారతి బాధ్యతలు చేపట్టారు. మండలంలో శాంతిభద్రతల అదుపునకు ప్రజలు సహకరించాలని కోరారు. మండల నాయకులు, సిబ్బంది శాలువాతో సన్మానించారు.

బేల ఎస్సైగా నాగనాథ్



ఎస్సై నాగనాథ్

బేల: మండల ఎస్సైగా నాగనాథ్ ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై దివ్యభారతి, తాంసి మండలానికి బదిలీ కావడంతో గాదిగూడ ఎస్సైగా పనిచేస్తున్న నాగ్‌నాథ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఇంటర్ టాపర్‌కు సన్మానం



రితికను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

బోథ్: సొనాల మండల కేంద్రానికి చెందిన జి.రితిక ఇటీవల వెలువడిన ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాల్లో 470 మార్కులకు 468 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం సొనాల మండల కేంద్రంలో రితికను సన్మానించి, అభినందించారు. మారుమూల ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, ప్రీతం రెడ్డి, రాథోడ్ సజన్, మాజీ వైస్ ఎంపీపీ స్వామి, మాజీ సర్పంచులు సదానంద్, సురేందర్, సుధీర్ రెడ్డి, అభిలాష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): అంతర్‌రాష్ట్ర రహదారి విస్తరణ పనుల్లో భాగంగా వారం రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జైనథ్ విద్యుత్ శాఖ ఏఈ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి వారం రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

చెట్టుపై పిడుగు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణ కేంద్రంతో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. ప్రజలు వర్షం పడటంతో కాస్త ఉపశమనం పొందారు. మండలంలోని లక్కారం గ్రామంలో రెడ్డి శ్రీధర్ ఇంటి ఆవరణలో ఉన్న చెట్టుపై పిడుగు పడింది. పిడుగు పాటుకు గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలు ఆర్పివేశారు. పక్కనే ఉన్న విద్యుత్‌తీగలు తెగిపడ్డాయి.

సందడిగా ఆత్మీయ సమ్మేళనం



గురువులతో శిశుమందిర్ పూర్వ విద్యార్థులు



పాల్గొన్న దయానంద పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్/తాంసి: ఆదిలాబాద్ పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల 2001–2002 బ్యాచ్, దయానంద పాఠశాల 2003–04 బ్యాచ్, జైనథ్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06 బ్యాచ్, తాంసి మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000– 2001 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకచోట కలుసుకొని సందడిగా గడిపారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి, సత్కరించారు.



జైనథ్ జెడ్పీఎస్ఎస్ పూర్వ విద్యార్థులు



కప్పర్ల పాఠశాల పూర్వ విద్యార్థులు

క్రీడలతో స్నేహభావం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



టీ షర్టులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఏటా మండల కేంద్రంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడకారులకు టీ షర్టులు అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, లోక శిరీష్‌రెడ్డి, చిలుకురి భూమన్న, సాబీర్, శివకుమార్‌రెడ్డి, రాథోడ్ రవి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

నేరడిగొండ: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వెంకటపూర్ గ్రామంలో గల జగజ్జనని జగదాంబ దేవి సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆదివారం లింబాజీ మహరాజ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దారు

ఉపాధ్యాయుడిగా రాథోడ్ ఉత్తమ్ ఎందరో మంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని చిన్న బుగ్గారం గ్రామానికి చెందిన రాథోడ్ ఉత్తమ్ ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాథోడ్ ఉత్తమ్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

జీవిత పాఠాలు నేర్పించారు..

మండలంలోని చిన్నబుగ్గారం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయుడు రాథోడ్ ఉత్తమ్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి తెలంగాణ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ హాజరయ్యారు. ఉత్తమ్ 38 సంవత్సరాల ఉపాధ్యాయ ఉద్యోగ జీవితాన్ని క్రమశిక్షణతో ఎందరో విద్యార్థులకు జీవిత పాఠాలు నేర్పించారని అన్నారు.

పాఠశాలలో సమ్మర్ క్యాంప్

- యాపల్‌గూడలో ఆటపాటలతో పాటు కంప్యూటర్ శిక్షణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు



క్యారమ్ ఆడుతున్న విద్యార్థులు



శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో డీఈవో, విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: వేసవిలో ప్రభుత్వం పాఠశాలలకు వేసవిలో సెలవులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే విద్యార్థులు ఎండలో తిరగడం, సమీపంలోని వాగులకు సరదా కోసం స్నానాలకు వెళ్లడం చేస్తుంటారు. దీంతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగిన ఘటనలు సైతం చూశాం. అయితే పట్టణాల్లో అయితే వేసవి సెలవుల్లో వారి తల్లిదండ్రులు డబ్బులు పెట్టి ప్రత్యేకంగా శిబిరాలకు పంపిస్తుంటారు. కానీ గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆ స్థాయిలో వేసవిలో శిక్షణ లభించడం కష్టం. అయితే మండలంలోని యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషల్ ఇంటిలిజన్స్ (కృత్రిమ మేధా వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.

శిక్షణ వీటిలోనే..

గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తారు. ఎండల దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయం పూటనే వ్యవసాయ పొలాలకు వెళ్తుంటారు. పిల్లలు ఎండలో తిరుగుతూ కనిపిస్తుంటారు. అయితే మండలంలోని యాపల్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు కృత్రిమ మేధా శిక్షణ అందిస్తున్నారు. పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 305 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో రెండో తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు శిక్షణ అందజేస్తున్నారు. ఇందులో డ్రైయింగ్, ఏఐ కంప్యూటర్, డ్యాన్స్, చిత్రలేఖనం, ఇండోర్ గ్యామ్స్, తదితర వాటిలో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణకు ప్రతీ రోజు 50 నుంచి 70 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

20 వరకు కొనసాగనున్న శిక్షణ..

ప్రభుత్వం ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు ఇచ్చింది. విద్యార్థులు ఎండలో తిరగకుండా ఉండేందుకు మండలంలోని యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 1న జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ ఈ నెల 20 వరకు కొనసాగనుంది. ఎండల దాంచి కొడుతున్న సందర్భంలో విద్యార్థులు ఎండలో తిరగకుండా ఆట, పాటలతో హాయిగా గడుపుతున్నారు.

విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు



వేసవి సెలవులలో విద్యార్థులు ఎండలో తిరుగుతుంటారు. తమ పాఠశాలలో కృత్రిమ మేధా శిక్షణను అందజేస్తున్నాం. దీంతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. విద్యార్థులు ప్రతీ రోజు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

– తూరాటి గంగన్న, ప్రధానోపాధ్యాయుడు, యాపల్‌గూడ

కన్నాపూర్‌లో తాగునీటి కష్టాలు



బావి పూడిక తీయిస్తున్న గ్రామస్తులు

సిరికొండ: భూగర్భజలాలు అడుగంటి పోవడంతో మంచి నీటి పథకాలు పని చేయడం లేదు. దీంతో మండలంలోని కన్నాపూర్ గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చేసేదేమి లేక ఆదివారం గ్రామస్తులందరూ కలిసి శ్రమదానంతో బావి పూడికను తీయించారు. గ్రామంలోని నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి క్రమం తప్పకుండా మిషన్ భగీరథ నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎండుతున్న పంటలు

- ఆయకట్టుకు అందని సాగునీరు
- మరమ్మతుకు నోచుకోని మాన్కాపూర్ చెరువు కాలువ



నీరు లేక ఎండిన మాన్కాపూర్ కాలువ

నార్నూర్: ఆరుగాలం కష్టపడి పంట సాగు చేస్తున్న రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. ఏజెన్సీలో రైతులు ప్రత్యామ్నాయ పంట సాగుపై దృష్టి సారిస్తున్నారు. వానాకాలం సాగుతో పాటు రబీ సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించి లక్షల రూపాయాలు ఖర్చు పెడుతున్నారు. నార్నూర్ మండలంలోని మాన్కాపూర్ చెరువు ఆయకట్టు ద్వారా దాదాపు 1500 ఎకరాలు రబీ పంటలు సాగు చేస్తున్నారు. 50 శాతం రైతులు జొన్న, గోధుమ కోతకు వచ్చింది. మరో 50 శాతం రైతులకు సంబంధించిన జొన్న పంట సాగులో చివరి దశలో ఉంది. మాన్కాపూర్ చెరువు కెనాల్‌లో పూడిక పేరుకుపోవడంతో చెరువు నుంచి నీరు సరఫరా కావడం లేదు. దీంతో పంట సాగుపై రైతులు దిగులు చెందుతున్నారు. చేతికి వచ్చిన పంట ఎండిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని కాలువ..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏజెన్సీ సాగు, తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో మాన్కాపూర్ గ్రామ సమీపంలో దాదాపు 3 కోట్ల రూపాయాలతో చెరువు నిర్మించారు. చెరువు ఆయకట్టు కెనాల్ నిర్మాణానికి రైతులు వ్యవసాయ భూములను సైతం ఇచ్చి సహకరించారు. కాలువ నిర్మాణం చెపట్టి దాదాపు 20 ఏళ్లకుపై అవుతున్నా.. మరమ్మతులు చేపట్టలేదు. కాలువ నుంచి నీరు బయటికి వృథాగా పోవడంతో రైతుల పంటలకు సాగునీరు సరిపోవడం లేదని వాపోతున్నారు. ఆయకట్టు ద్వారా మాన్కాపూర్, నార్నూర్, బలాన్‌పూర్, తాడిహత్నూర్, గంగాపూర్, నాగల్‌కొండ, ముక్తాపూర్ రైతులు ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. అధికారులు స్పందించి కెనాల్ మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతు చేస్తాం

మాన్కాపూర్ చెరువు ఆయకట్టు ద్వారా మొత్తం 1500 ఎకరాల వరకు రైతులు పంటలు సాగు చేస్తున్నారు. చెరువులో పూడికతీత పనులు చేటపట్టడంతో పాటు కాలువ మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం.

– వినోద్ రాథోడ్, డీఈఈ, మైనర్ ఇరిగేషన్, ఉట్నూర్

నత్తనడకన జొన్న కొనుగోళ్లు



రోడ్డుపై జొన్న బస్తాలు

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో చేపడుతున్న జొన్నల కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. మార్కెట్‌యార్డుకి రైతులు పెద్ద ఎత్తున జొన్నలను విక్రయానికి తీసుకురావడంతో స్థలం లేక రోడ్డుపై కుప్పలు పోశారు. గన్నీ సంచుల కొరత కారణంగా కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఆదివారం సంచులు రావడంతో కొనుగోళ్లు ప్రారంభయ్యాయి. జాప్యం జరగడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రిపూట పంటపంటను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి జొన్న కొనుగోళ్లను చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కులగణన నిర్ణయం హర్షణీయం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని ప్రధాన మంత్రి మోదీ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక బీజేపీ కార్యాలయంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టడం ద్వారా బడుగు, బలహీన వర్గాలకి న్యాయం జరుగుతుందన్నారు. మోదీ తీసుకున్న నిర్ణయం యావత్ దేశ ప్రజలందరు హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు పడ్వాల్ విజయ్‌సింగ్, మాజీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, రాథోడ్ రాధిక, రాథోడ్ భీంరావ్, ఆడావ్ చంపత్ రావ్, దేవ్‌పూజే మారుతి, కనక తుకారం, దిలీప్ మోరే, మెస్రం తుకారం పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బోథ్: సొనాల మండల కేంద్రంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను శాలువాతో సత్కరించారు. అధికారులకు రైతుల పక్షాన నిలిచి సహకరించాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టవద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్క్‌ఫెడ్ ఎంఈ ప్రేమ్‌సింగ్, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, పీఏసీఎస్ సీఈవో గోలిస్వామి పాల్గొన్నారు.